# ఖామోష్

సిక్కని సిగురుల్లో పొద్దు వాటారింది.

సింతల్ల తోపులో సీకటి వొడిచింది. పికిలిపిట్ట పల్లకుంది. సిలక టెక్కముడుసుకుంది. గువ్వ గూడెక్కింది. సుట్టుగుడిసెలో దివ్వెలిగింది - ఏడకే, ఏడకే సినదాన -

సేతిగాజులు సిటిలె-సెంప కందిపోయె-మొగాన దూమెరుగులేదు. సూపులో సిగారంలేదు-ఎవరే బిడ్డా నీవు.

ఐనవాడు కాలరాసినాడా—కానివోడు కంట జూసినాడా-నీ నరాలు మూగమూలుగాయె. కూతురా, ఏందమ్మా నీ యాతన-కన్నతల్లి యిసం బెట్టెనా—కన్నతండ్రి కాసు కమ్మ జూపెనా-కూనా, మణుసులన్న యిసుగేసి, బతుకన్న యిషమేసి, కాలికి బలపం గట్టుకొని, ఏటిపాయలో లోతుచూసి ఒక్క దుముకు దుముకుదమని వచ్చినావా ? — ఏందమ్మా కత?

ఆఁ....కతే! అవ్వా, సకినెం సెప్పినట్టు పలికినావ్. నన్ను కన్నామె సత్తెంగనే యిసం పెడతానన్నది — ఎందుకంటావా, ఆయమ్మకు ఒకేలు యిడిసినోడు - తమ్ముడు లాటోడు—తలకు మాసినోడు-నన్నిలుసు కుంటనన్నడట.

పదికరుకులు నిలుసున్నపళాన బయాన యిచ్చెనే- తాళికట్టీ కట్టంగనే పదపిల్ల కాసులు ముట్టజెప్పుతనన్నడే - ఏం, తీపు దిగెళ్ళిందా! నిన్ను ఆడికి కట్టాక మాన నంటే-మాననంది, మాయమ్మ-సయ్యాన మాయమ్మ.

కాకులు దన్నంగ గెద్దలు దన్నంగ పల్లేపాడూ దుమ్ములైరిగిన బతుకు ఆడిది. మణుసుల్లో మణిసికాడు. నరుల్లో నరుడుకాడు. నడీదిని తలెత్తుకు తిరగలేడు. నాకీడు కాదు. జోడుకాదు. ఆడు-నాకేలనే అంటిని, మాయమ్మ ససేమిరా-అనె.

నీ మాట మార్చుకో అని గెడ్డమంటి బతిమిలాడినా - ఓసీ ధగిడీ, నీ బుద్ది మార్చుకో అని ఛెళ్ళునేసింది-యిసమన్నా తాగేను కాని అందుకొల్ల నంటిని. అట్టనే తాగమంది. గన్నేరు పసరుదీసి ఇచ్చింది. కాని నోటపెట్టలేక పోతిని. గండ్రసేదు - యిసం - అమ్మా కూసంత సక్కెరట్టుకు రాయే అంటిని. పకాలుమనె. సావబోతూ సక్కెర కావాలా అని, మాడున మొట్టె బతుకో పాడో తీయంగ గడిపేసాయె - అట్టనే కన్నుమూయనీ అంటిని. సక్కెరకు పైసా ఏడదే అని మా అవ్వ మొరా యించె-మా అయ్య నడిగినా- ఎందుకనె - అందుకంటిని.

అప్పుడెంత రగడాయె-ఆ మణిసి మాయమ్మ కొప్పు సిగ అంకించుకొనె - ఏమే అబిసీ, నా బిడ్డను అంత కారు సౌకగ బేరమిచ్చినావంటే - నా కూన పదికాసు లేనా పలికేది-అని లెక్కేసి కాసుకో తాపిచ్చి, మాయమ్మ కుయ్యో మనంగా కూలేసి, నన్నీడ్చుకుని పోయె.

"ఏడకు ?-ఆ మేడకాడికి - ఏ మేడంటావా - ఓ ముసిలి జులపాలాయన మక్కెలిరిగిన అంబోతల్లె లోగిలి కంబాని కానుకుని ఇకిలిస్తూ కూకుని అంటడే - అద్గది - ఆ మేడ: ఆ చింబోతు మా అయ్యకు ఎరికే నంటావా - కాదు - పుంతలో, మాకో దిబ్బ మొగమోడు తగిలినాడు-మా అయ్య వాలకం సూసి - ఏందీ కథ, ఎందు కట్ట పడుసును గుంజుతవ్, నీకేం గావాలె యీ గుజ్జు" అంటూ మాట కలిపినడు.

మా అయ్య మూతి బిగింపు మీదుండడు. ఆడు మాట సేసుకొంగనే పోరా బేపీ, అన్నట్టు త లిసిరినాడు-కాని, పువాకు పాయ సేతికివ్వంగనే, సప్పబడినాడు.

కూటికి నూకల్లేవు-నూకలికి రూకల్లేవు. మరి బగవంతుడు సెప్పినన్నాళ్ళూ బతకాలిగంద! సంతకు బోతుంట-నన్నడు మా అయ్య.

సరుకో—

సేతనే ఉందిగా—

నికార్సేనా—

కాక - మరేందనుకుండవ్. యెన్న గాచిన నెయ్యి.

మారుబేరమా —

సొంత సొమ్మే - కట్టుకున్నదాని కడుపు నుట్టింది - ఇంత లెక్క మేపి, ఏపు సేసినా -

అటనే - అటానే - కూతురుకి కూడెట్టి, సెడి అమ్ముకుండవన్నమాట-

అదేంకూత మడిసీ, సేతగాని శెట్టి వదరుబోతడుగాని, మన కమామీషు నీ కెరికలే-పైసా యెరేసి పరక గుంజుకునే మొగోడి నయ్యోవ్-ఏమనుకుంటుండవో.

ఓరి నీయాలి కడుపున కవలపిల్లలుట్ట!-సెయ్ దిరిగిన వోడివే- మరి, సెప్పేదో మాట !

నీ వుచ్చుగుంటవా....

నాకుండ తొంబ సాలకనా-కలిసొస్తే నేనూ ఓ రెండురాళ్ళు సేసుకుందమని - సెప్పొద్దూ మన్లోమాట-నా కీ యాపారంలో లగువూ, బిగువూ తమాం దెలుసు. సిసలైన ఖామంద్ కాడకు తోడకపోతా - నీవు చుప్‌నుండు, ఐసా పైసా నేం జూసు కుంట ....

ఇట్టా, ఆ మడుసు లిద్దరూ కూడబలుక్కుని, నన్ను కొంచు పోయిర్రు: ఆకడ ఆ జులపాలోడు, ఎగజూసి దిగజూసి జబ్బపట్టిసూసి, సెంపలు పిండిసూచి - ఇకిలించి నాడు: ఆళ్లా ఆళ్లా నాకు ఇనుకోరాకుండ గుసగుసలోయి, రూకలు ఎన్నుకుండరు. అవ్వా, గొడ్డు నమ్ముకున్నట్టు బిడ్డ నమ్ముకున్నడు—మా అయ్య - పోన్లే కడుపులో మంట కానరాని మంటగదా-ఇంక ముప్పొద్దులూ నా పేరు జెప్పుకుని, ఉడుకు నీలోసుకుని ఏడీ యెచ్చనా దింటరు. నే నందుకన్లే - పోతూ పోతూ, మా అయ్య, నా మొగంకేసి సూడరాదా! యెల్తుండనని సెప్పరాదా-నిన్నో నీడకు సేస్సిన- ఆ మడిసిని నమ్ముకుని సల్లంగ బతకమని అనరాదా - ఉహుఁ - అనలా - నే మడిసినా మాకునా, అని కుమిలిపోయిన.

కాని, అవ్వా-ఆ జులపాలాయన — మణిసికాడు - దేవుడు: నేనట్టా గుసుగు-గుసుగుమంటూ కూలిపోంగా, ఆ అయ్య నా కాడకొచ్చి, మీద సెయ్యేసి, యెక్కెక్కి—

నవ్వినడు - బిడ్డా అన్నడు - భగవంతుడు మమ్మల్ని ఒంటిరెక్క పచ్చుల్ని చేసినడు, నట్టింట తొట్టికట్టలా-సేత బిడ్డనెత్తలా-ఇట్టానే ముమ్మారు బిడ్డల్నిచ్చుకున్న - కాని, నీడ నుండంగనే నెయ్యీ బువ్వా వంట పట్టంగనే - బిడ్డలకు పుట్టరాని బుద్ధులుట్టు కొచ్చినయ్—సేతి కందిం దట్టుకొని, ఎగిరి పోయిన్రు. ఆ బతుకుల కంతే ప్రాపతం అనుకుండ ఇప్పటికి ఏకీ సాలాయె ఇంక మాకీ గంతర బింతర కూడదనుకున్న-కాని బిడ్డా—నే నూరకున్నా, దైవం ఊరకుండలా-నిన్నిచ్చినాడే-అన్నా డవ్వా-

ఇంటివిగంద-నన్ను కన్నోడు బిడ్డా అని, బతుకున్నంత లెక్కా పిలవాల్సి నోడు-అమ్ముకుంటడా ముక్కూ మొగం ఎరగని మడిసి- బిడ్డా అంటడా - ఏం దవ్వా యీ యిసిత్తరం-నాకు మతోయింది- వలవల్లాడి పోయిన ఆ అయ్య పాదాలట్టుకున్న: అయ్యా, పుట్టి బుద్దెరిగినాక, మా అయ్యిట్టా పిలవలా, మా అమ్మిట్టా పిలవలా. ఆకలే అమ్మా, అని గొంతు సించుకుంటే మా యమ్మ మూకుడులో ఎండు మెతుకులు రాల్సి, నీది దయ్యపాకలే అని మొట్టేది-నాకు ఏడుపొస్తే, మా అయ్య నడుమిరగ దన్నేవోడు: కూడు లేక ఎట్టా బతుకుతానయ్యా-దగమోపైంది- ఆ యమ్మ. నాయమ్మ నడుక్కొని తినేదాన్ని-అందుకూ మా అయ్యకు రోసముట్టుకొచ్చె-తాను మారాజంట, నే నడుక్కు దింటే తనకు తలొంపులంట - గుంజకు కట్టి పడేసిండు - అయ్య పెట్ట డాయె-అడుక్కు తినద్దంటడయె-నీలు దాగి బతికినానయ్య ...

అని గోడు సెప్పుకుంటూ గోలెట్టిన: ఆ అయ్య కన్నుదడిసి గావురుమన్నడు. అవ్వా ఆకడ మారాజు బిడ్డల్లే బతికిన. కడుపునిండ కూడాయె, కంటినిండ నిదరాయె- బంతిపువ్వల్లె ఏపు దేలినా-

కాని, అవ్వా నూరులేని సుట్టుగుడిసెలో పుట్టి, నీడలేని బతుకు బతికిన, నిప్పచ్చరందాన్ని నాకా మేలు దక్కలా-ఆ అయ్య, ఆ తల్లి తీర్థమాడ బోయినోరు— తిరిగి లోగిలి సేరుకోలేదు. పెద్దేటిలో, మునక వేయంగనే గండు మీనేసుకు పోయిం దిట. సింకిపాతను నేను మిగిలిన-మరిగత్తె, నాకు కూడేది. నీడేది...

సుట్టపోళ్ళంట-లోగిలి కమ్ముకున్నరు-అదేం పాపమో అవ్వా, ముసలోడు - ముతకోడు, నన్ను సూసీ సూడంగనే యికిలింపులుగావు, యికయికలుగావు- నిదరోద మని, ఓ మూల పండుకుంటె- పరువు మాలిన కూతగూసిరి - సేయి అంకించుకున్రి- ధూత్తెరీ అంటిని—తన్ని తగిలేసిరి-ఏడకు బోయేది.

ఎండనుబడి యెండిన - యెవడికాడు యెగాదిగ సూసేవోడే - సీకటిలో

దాక్కున్న-నిగిలాడే వోడు— తానా కీడ్చుకుపోయె అవ్వా, సేతికంత ఒక్క నరకం అనుకో-నట్టడివిలో రగతం తావే సింగం, సివంగీ షెరుగవ్వా-బస్తీలో నరమానవుడి కన్న అవి పావణాతి కావవ్వా — పొద్దొడవంగనే — అయ్యను తోడుకొచ్చి, నన్నప్ప గించిరి-మళ్ళీ పాటు మొదలాయె- మా అయ్య నన్నేడకో గుంజుకు పోతుండె - అమ్ముకు తిందమని-నా బతుకింతే గంప అనుకుండ-అయ్యా, ఆ మారాజుకాడ రూక లుచ్చుకుంటివే-నీ సొత్తు ఆరికిస్తివే-మళ్ళీ ఎట్టా అమ్ముకుంటవయ్య- అంటిని - మా అయ్య సాచి ఒకటుచ్చుకున్నడు- నీ కిది దరమం కాదయ్యా అంటిని - రెండుచ్చు కున్నడు-సుక్క మీదున్నదేమో పణిసి తూలుతున్నడు: నా మొగాన తుబుక్కు మన్నడు. అవ్వా, నాకుగ్రం వచ్చె-ఆ జీవానొక్క తోపుదోసిన — కూలిపోయిండు - పరుగుచ్చుకున్న.

అవ్వా - కన్నవోడు అమ్ముకుంటాడా - బిడ్డా అని సేరదీసిన మారాజు నీట గలిసి పోతడా-యింక ఆడకూతురు ఎట్టా బతకాలి. లోతు సూసుకుంప మనుకున్నా— మూడు మునకలేస్తే ముప్పు సెలిపోతుంది గద-ఏమంటవు ....

....ఓసి కూనా బతకమంటనే - నరమానవుడంటె - ఎవడే, ఆడకూతురి కడుపున పుట్టినోడే-మనం యెత్తి పెంచినోడే - జోలపాడితే నిదురోయేవాడే, బిడ్డా - మనం సాకిన గొర్రె పొట్టేలుకు కొమ్ముల్ దిరిగి దూకుడు సేస్తే - బెదిరిపోతామా - సిట్టుండలెట్టి మేపిన పుంజు, కొక్కిరాయిగా తన్నబోతే సెదిరిపోతమా - ఎన్నెమ్మ పురుక్కి, నెత్తడిసే బుద్ధి-సెంపలేసుకుని సేమెత్తి మొక్కితే దాని గుణం మారు తుందా-సెప్పున కొట్టాలిగాని-నరంలేని నరమానవుడూ అంతే— మంచికిబోయి — మా అయ్యవురా అంటే అమ్ముకు దింటడు-మనసోయిందిరా - సక్కనోడా అంటే — కాళ్ళ కాడ కూలేసి, సిగపాయ ఒడిసి పట్టుకుంటడు.

నిన్ను నమ్ముకుంటినో అంటే—లోకువజేసి బూతు కూత కూస్తడు - నీ సిత్త మమటే సేయిసురుతడు. మనం కస్సుమంటే సేయెత్తి సలాం గొడతడు- పోరా బచ్చా అంటే-జీ బేగంసాహెబా అంటడు - బద్మాష్ అంటే - సెబాస్ అంటడు - అదీ వాడి పుటక — అదీ వాడి బుద్ధి-కూనా- ఆడకూతురికి - ఓ కంట యెన్నెలుండాలి, ఓ కంట కత్తులుండాలి—గొంతులో కోయిలుండాలి—కొరడా లుండాలి- ఒక సేత పప్పా పాశెం- ఒక సేత నూరెన బాకూ - అట్ట బతకాలి - గుబిల్ దిప్పితే నరమానవుడు - మనకు గులామే: మాలిక్ కాడే. కూనా—ఫికర్ నయ్-యిది యాదుంచుకు బతుకు.